సాక్షి
అనంతపురం

సోమవారం । 29 । మే । 2023



'మొక్క'వోని సంకల్పం
ఏఆర్ ఏఎస్పీ హనుమంతు పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి చేస్తున్నారు. 50 వేలకు పైగా మొక్కలు నాటించారు. 8లో



నేడు ప్రజా సంక్షేమ యాత్ర ముగింపు
తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన మూడో విడత ప్రజా సంక్షేమ యాత్ర సోమవారం ముగియనుంది. 8లో

గరిష్టం/కనిష్టం
42.2°/24.5°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం, ఉక్కపోత అధికంగా ఉంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

జూన్ 4 వరకు మొక్కజొన్న కొనుగోళ్లు



అనంతపురం అగ్రికల్చర్: ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) క్వింటా రూ.1,962 ప్రకారం జూన్ 4 వరకు రైతుల నుంచి మొక్కజొన్న కొనుగోళ్లు చేస్తామని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ–క్రాప్ డేటా ఆధారంగా రబీలో మొక్కజొన్న అధికంగా సాగు చేసిన 10 మండలాల పరిధిలోని 21 కేంద్రాల్లో కొనుగోళ్లు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గత రబీలో 12,053 హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేయగా.. 1,000 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యం నిర్దేశించినట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు రూ.1.68 కోట్లు విలువ చేసే 850 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని తెలిపారు. 720 మంది రైతులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే 50 మంది రైతుల ఖాతాల్లోకి చెల్లింపులు జరిగాయని పేర్కొన్నారు. జూన్ 4వ తేదీ కొనుగోళ్లు బంద్ చేస్తున్నందున సాధ్యమైనంత తొందరగా మొక్కజొన్న రైతులు వినియోగించుకోవాలని సూచించారు.

జేఎన్‌టీయూలో 3న క్యాంపస్ డ్రైవ్



అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలోని సీమెన్స్ సెంటర్‌లో జూన్ 3న క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి ఎల్.ఆనంద్ రాజ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కెరీర్ ప్రోగ్రాం ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. మేథమేటిక్స్ లేదా బిజినెస్ మేథమేటిక్స్‌లో 2022 లేదా 2023లో ఇంటర్మీడియెట్ 60 శాతం కంటే ఎక్కువ ఉత్తీర్ణతతో పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ ప్రోగ్రాంకు ఎంపికైతే నెలకు రూ.10 వేల స్టైఫండ్, ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌తో ఏడాది శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తయిన తరువాత హెచ్‌సీఎల్‌లో ఉద్యోగం కల్పిస్తారు. ఉన్నత విద్యను అభ్యసించాలనుకుంటే ఐఐఎం, బిట్స్, శస్త్ర, కేఎల్ వర్సిటీల్లో స్కాలర్‌షిప్‌తో కొనసాగించవచ్చు. ఎడ్యుకేషనల్ ఫీజు పాక్షికంగా హెచ్‌సీఎల్ చెల్లిస్తుంది. ఆసక్తి గల అభ్యర్థులు క్యాంపస్ డ్రైవ్‌కు రెజ్యూమ్ లేదా బయోడేటాతో పాటు ఆధార్, సర్టిఫికెట్ల జిరాక్స్‌తో మూడో తేదీ ఉదయం 8 గంటలకు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 86880 30375 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

ఇద్దరిపై బహిష్కరణ వేటు



బహిష్కరణ ఉత్తర్వులను అందజేస్తున్న పోలీసులు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఇద్దరిని మూడు నెలలు జిల్లా నుంచి బహిష్కరిస్తూ కలెక్టర్ గౌతమి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కుందుర్పి మండలం రుద్రంపల్లికి చెందిన బోయ అక్కులప్ప, జానంపల్లికి చెందిన వడ్డే వెంకటేశులుపై కళ్యాణదుర్గం పోలీసు సబ్‌డివిజినల్ పరిధిలోని పలు స్టేషన్లలో చెరి మూడు కేసులు ఉన్నాయి. అయినా వీరిలో మార్పు రాకపోవడంతో ఎస్పీ కె.శ్రీనివాసరావు ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టర్‌కు నివేదించారు. ఈ మేరకు ఇద్దరినీ ఈ నెల 26 నుంచి మూడు నెలల పాటు జిల్లా నుంచి బహిష్కరిస్తున్నట్లు ఉత్తర్వులు వెల్లడించారు.







పరీక్ష కేంద్రంలోకి పర్సు అనుమతించకపోవడంతో కుటుంబ సభ్యులకు అందిస్తున్న అభ్యర్థి, అనంతపురం ఆర్ట్స్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థుల తనిఖీ చేస్తున్న పోలీసులు, సివిల్స్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐఏఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్, జేసీ కేతన్‌గార్గ్

సజావుగా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

అనంతపురం అర్బన్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష అనంతపురంలో సజావుగా జరిగింది. ఎనిమిది కేంద్రాల్లో రెండు సెషన్లుగా ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 56.045 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 3,213 మంది అభ్యర్థులకు గానూ ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు జరిగిన పేపర్–1 పరీక్షకు 1,814 మంది (56.45శాతం) అభ్యర్థులు హాజరయ్యారు. 1,399 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగిన పేపర్–2 పరీక్షకు 1,788 మంది (55.64 శాతం) అభ్యర్థులు హాజరయ్యారు. 1,425 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఎస్కేయూ, జేఎన్‌టీయూ, ఆర్ట్స్ కళాశాల, ఎస్ఎస్‌బీఎన్, తదితర పరీక్ష కేంద్రాలను యూపీఎస్సీ పరిశీలకుడు సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ తనిఖీ చేశారు.

విత్తన పంపిణీకి వేళాయె..!

- నేడు కళ్యాణదుర్గంలో ప్రారంభించనున్న మంత్రి ఉషశ్రీచరణ్
- 40 శాతం రాయితీతో పంపిణీకి 78 వేల క్వింటాళ్ల వేరుశనగ
- అందుబాటులో కందులు, కొర్రలు, రాగి, పచ్చిరొట్ట విత్తనాలు



ఆర్‌బీకేలకు వెళుతున్న వేరుశనగ బస్తాల లారీ, (ఇన్‌సెట్) విత్తన వేరుశనగ

విత్తనాల వారీగా రైతు చెల్లించాల్సిన మొత్తం ఇలా..		
విత్తన రకం	పరిమాణం	రైతు వాటా (రూ.)
కే-6 వేరుశనగ	30 కిలోల బస్తా	1,674
1812 రకం వేరుశనగ	30 కిలోలు బస్తా	1,494
ఎల్ఆర్‌జీ రకం కంది	4 కిలోల ప్యాకెట్	311.92
హైబ్రీడ్ రకం కంది	2 కిలోల ప్యాకెట్	179.20
ఐపీఎం రకం పెసలు	4 కిలోల ప్యాకెట్	329
మినుము	4 కిలోల ప్యాకెట్	329
కొర్రలు	2 కిలోల ప్యాకెట్	67.50
రాగులు	2 కిలోల ప్యాకెట్	69.50
జీలుగ విత్తనాలు	10 కిలోల ప్యాకెట్	395
జనుము విత్తనాలు	10 కిలోల ప్యాకెట్	420
పిల్లిపెసర విత్తనం	8 కిలోల ప్యాకెట్	388

అనంతపురం అగ్రికల్చర్: రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ సోమవారం మొదలు కానుంది. కళ్యాణదుర్గం మండలం పాలవాయి ఆర్‌బీకేలో మంత్రి ఉషశ్రీచరణ్ చేతుల మీదుగా విత్తన పంపిణీ ప్రారంభించనున్నారు. ఆ తర్వాత ఎక్కడికక్కడ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు విత్తన పంపిణీని లాంఛనం చేయనున్నారు. అందుకు వ్యవసాయశాఖ, ఏపీ సీడ్స్ ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఖరీఫ్‌లో అదనులోనే పంటలు సాగు చేసుకునేందుకు వీలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు విత్తన పంపిణీ చేపడుతోంది.

40 శాతం రాయితీతో వేరుశనగ..

జిల్లాకు 78,245 క్వింటాళ్ల విత్తన వేరుశనగకాయలు కేటాయించారు. 40 శాతం రాయితీతో పంపిణీ చేసేందుకు అనుమతిచ్చారు. ఇందులో కే-6 రకం 76,945 క్వింటాళ్లు, కదిరి–లేపాక్షి 1812 రకం 1,300 క్వింటాళ్లు కేటాయించారు. ఆర్‌బీకే వేదికగా ఇప్పటికే 42 వేల మంది రైతులు 38 వేల క్వింటాళ్ల విత్తనకాయల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 280 ఆర్‌బీకేల్లో 25 వేల క్వింటాళ్లు పంపిణీకి సిద్ధం చేశారు.

- ఎల్ఆర్‌జీ–41, 52 రకం కందులు 30 శాతం రాయితీతో 4,300 క్వింటాళ్లు, అలాగే ఐపీఎం 2–14 రకం పెసలు 156 క్వింటాళ్లు, పీయూ–31, ఎల్‌బీజీ–752, ఐపీయూ 2–43, టీబీజీ–104 రకాలకు చెందిన మినుము విత్తనాలు 42 క్వింటాళ్లు కేటాయించారు. ఇక ఎస్ఐఏ–3156 రకం కొర్రలు 250 క్వింటాళ్లు, ఇంద్రావతి రకం రాగులు 3 క్వింటాళ్లు కేటాయించి వీటిపై 50 శాతం రాయితీ వర్తింపజేశారు. 50 శాతం రాయితీతో 200 క్వింటాళ్ల వరకు జనుము, జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట విత్తనాలు (గ్రీన్‌మెన్యూర్) కేటాయించారు. ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు పల్లెల్లోనే అన్ని రకాల విత్తనాలు నాణ్యమైనవి అందించే ప్రక్రియ సోమవారం నుంచి మొదలు కానుంది. రైతులకు పెట్టుబడి భారం కాకుండా వైఎస్సార్‌రైతు భరోసా–పీఎం కిసాన్ కింద ఈ నెల 30న ఒక్కో రైతు ఖాతాలోకి రూ.7,500 ప్రకారం జమ చేస్తుండటంతో విత్తన పంపిణీ ఊపందుకోనుంది. బ్యాంకుల్లో పంట రుణాల రెన్యూవల్స్ జోరుగా సాగుతున్న కారణంగా ఖరీఫ్‌కు ఇబ్బంది ఉండదని అధికారులు అంచనా వేస్తున్నారు.

జూన్ నుంచి రాగుల పంపిణీ

అనంతపురం అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు బియ్యం కార్డుదారులకు అత్యధిక పోషకాలున్న రాగులను జూన్ నెల నుంచి పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 6,54,180 కార్డులకు 650 టన్నుల రాగులను ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు. కార్డుదారు కోరిన మేరకు రాగులు కిలో నుంచి మూడు కిలోల వరకు బియ్యం స్థానంలో ఉచితంగా ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనాల ద్వారా పంపిణీ చేస్తారన్నారు. మొదట పట్టణ ప్రాంతాల్లో రాగులు పంపిణీ ప్రారంభిస్తారన్నారు. తదుపరి గ్రామీణ ప్రాంతాల్లో చేస్తారని చెప్పారు.

రాగుల్లో అత్యధిక పోషకాలు..

చిరుధాన్యాల సాగును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని జేసీ స్పష్టం చేశారు అందులో భాగంగా 2022–23 ఆర్థిక సంవత్సరాన్ని చిరుధాన్యాల సాగు సంవత్సరంగా ప్రకటించారన్నారు. చిరుధాన్యాల్లో రాగులు అత్యధిక పోషకాలు కలిగి ఉంటాయన్నారు. రాగుల్లో ఫాస్ఫరస్, ఐరన్, ఫైబర్, క్యాల్షియం, జింక్ అధికంగా ఉంటుందన్నారు. వీటి వినియోగంతో మధుమేహవ్యాధి నియంత్రించవచ్చన్నారు. ఎముకల దృఢత్వం పెరుగుతుందని, గుండె పనితీరు మెరుగవుతుందని, జీర్ణక్రియ ఉన్నత స్థితికి చేరుతుందని తగ్గుతుందని వివరించారు. శరీరంలో వేడిని కూడా తగ్గిస్తుందన్నారు. రాగులు తీసుకోవడం వల్ల బాలింతల్లో పాల ఉత్పత్తి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారన్నారు.

టవర్‌క్లాక్ బ్రిడ్జి రెడీ



ఆదివారం రాత్రి విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న టవర్ క్లాక్ పై ఓవర్ బ్రిడ్జి



నూతన బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత

- నేడు బైక్ ర్యాలీతో రాకపోకలు ప్రారంభం
- ఐదు నెలలు ముందుగానే నిర్మాణం పూర్తి

అనంతపురం క్రైం: జిల్లా కేంద్రం అనంతపురంలో అత్యంత కీలకమైన టవర్‌క్లాక్ ఫ్లైఓవర్ బ్రిడ్జి సిద్ధమైంది. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం చేపట్టే బైక్ ర్యాలీతో బ్రిడ్జిపై రాకపోకలు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం బ్రిడ్జిపై ప్రత్యేక లైటింగ్‌ను కూడా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు హాజరుకానున్నారు. అండర్ పాస్, ఇతర పనులు పూర్తయ్యాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర మంత్రితో అధికారికంగా ఈ చారిత్రక బ్రిడ్జిని ప్రారంభించనున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం రాత్రి ఎమ్మెల్యే అనంత బ్రిడ్జిని పరిశీలించారు.

నేషనల్ హైవేగా మార్పు చేసి...

అనంతపురం టవర్‌క్లాక్ – పీటీసీ రైల్వే ఓవర్ బ్రిడ్జిని 1965లో నిర్మించారు. ఐదు దశాబ్దాల తర్వాత బ్రిడ్జి అక్కడక్కడా దెబ్బతినడం, వాహనాలకు అనుగుణంగా రోడ్డు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. నేషనల్ హైవేస్ పరిధిలో ఉన్న ఈ బ్రిడ్జిని 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం స్వార్థ ప్రయోజనాల కోసం ఆర్‌అండ్‌బీ పరిధిలోకి తీసుకొచ్చింది. దీంతో అభివృద్ధికి ప్రతిబంధకంగా మారింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పెరుగుతున్న నగర జనాభాకు అనుగుణంగా టవర్‌క్లాక్ బ్రిడ్జిని విస్తరించి, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని భావించారు. ఈ విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బ్రిడ్జిని 2020 నవంబరులో నేషనల్ హైవేస్ పరిధిలోకి తీసుకొచ్చారు. 2021 మే 3న బళ్లారి బైపాస్ వద్ద జాతీయ రహదారి– 44ను కలుపుతూ నగర శివారు పంగల్ రోడ్డు వద్దనున్న చెన్నై హైవేకి అనుసంధానిస్తూ కేంద్రం రూ.311.93 కోట్లతో అర్బన్ ప్రాజెక్ట్ చేపట్టేలా చర్యలు తీసుకుంది. టవర్‌క్లాక్ బ్రిడ్జి సహా 9.2 కిలోమీటర్ల పొడవున రోడ్డు పనులు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 720 మీటర్ల(దాదాపు 1.44 కి.మీ) పొడవున రెండు వైపులా (ఫోర్‌వే) బ్రిడ్జి ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం బ్రిడ్జి పనులు పూర్తయ్యాయి. 2021 అక్టోబర్ 25న మొదలైన పనులు ఈ ఏడాది అక్టోబర్ 24కు పూర్తి కావాలి. అయితే 5 నెలలు ముందే కాంట్రాక్ట్ సంస్థ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసింది.

సీఎం చిత్తశుద్ధితోనే బ్రిడ్జి ఏర్పాటు

ఒక నాయకునికి చిత్తశుద్ధి ఉంటే ఎంతటి అభివృద్ధి అయినా సాధ్యమని ఈ పనులతో నిరూపితమైంది. సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్తశుద్ధితోనే బ్రిడ్జి, ఫోర్ వే ఏర్పాటు సాధ్యమయ్యాయి. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా రికార్డు సమయం(15 నెలలు)లో, ప్రజల పూర్తి సహకారంతో బ్రిడ్జి పనులు పూర్తయ్యాయి. సీఎం ప్రత్యేక చొరవతో ఇప్పటికే నగరంలో రూ.650 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రానున్న ఏడాదిలోనూ సాధ్యమైనంత అభివృద్ధి చేసి చూపుతాం.

– అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్యే

'సాఫ్ట్' దొంగ

- దొంగను చేసిన వ్యసనం
- పక్కింటి ఒంటరి మహిళ నగల చోరీ
- నిందితుడిని పట్టించిన వేలిముద్రలు
- వెలుగు చూసిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నిర్వాకం



సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సందీప్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: మద్యం వ్యసనం ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని దొంగను చేసింది. డబ్బు కోసం పక్కింటి ఒంటరి మహిళ నగలపై కన్నేశాడు. అదను చూసి నగలు చోరీ చేశాడు. అనుమానం రాకుండా అత్యంత జాగ్రత్తపడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు పది రోజుల్లోపే కేసు ఛేదించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగే దొంగ అని గుర్తించి కటకటాల్లోకి నెట్టారు. తాగుడుకు అవసరమైన డబ్బు కోసమే ఈ చోరీ చేసినట్లు నిందితుడు పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతపురం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ కాలనీలో రమాదేవి అనే ఒంటరి మహిళ నివాసం ఉంటోంది. ఆమె అద్దెకుంటున్న చిన్నపాటి భవనంలోనే నాలుగు పోర్షన్లు ఉన్నాయి. రమాదేవి ఇంటి పక్కనే మరో కుటుంబం నివాసం ఉంటోంది. వారి ఇంటికి ఇటుకలపల్లికి చెందిన సందీప్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వచ్చి వెళుతుండేవాడు. వర్క్ ఫ్రం హోం కావడంతో ఎక్కువ శాతం అతనూ ఇక్కడే గడిపేవాడు. ఇందులో భాగంగానే రమాదేవి దగ్గర బంగారు నగలు ఉన్న విషయాన్ని సందీప్ గమనించాడు. ఎలాగైనా కొట్టేయాలని నిర్ణయించుకున్నాడు. వేసవి కావడంతో అన్ని కుటుంబాల వారూ రాత్రిపూట మేడపై పడుకుంటున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని చోరీకి పథక రచన చేశాడు. ఈ నెల 14న రాత్రి అక్కడే బస చేశాడు. అర్ధరాత్రి వేళ రమాదేవి తల దిండుకింద ఉంచిన తాళం చెవి తీసుకుని ఇంట్లోకి వెళ్లాడు. బీరువా తెరచి 25 తులాల బంగారు ఆభరణాల్లో 7 తులాల నగలను అపహరించాడు. తిరిగి తాళం చెవిని రమాదేవి దిండు కింద పెట్టి.. అక్కడి నుంచి జారుకున్నాడు. 15న ఉదయం ఇంట్లోకి వెళ్లిన రమాదేవి.. అప్పటికే తెరిచి ఉన్న బీరువాని గమనించింది. బంగారు నగలను పరిశీలిస్తే కొన్ని కనిపించలేదు. చోరీ జరిగిందని గుర్తించి వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది.

బుకాయించినా.. బుక్కయ్యాడు..

పోలీసులు మొదట చోరీ జరగలేదని భావించారు. అయితే రమాదేవి పక్కాగా చెబుతుండటంతో నేరస్థలాన్ని పరిశీలించిన పోలీసులు తగిన ఆధారాల కోసం దర్యాప్తు ముమ్మరం చేశారు. వేలిముద్రలు సేకరించారు. అనంతరం ఆ ఇంటి చుట్టుపక్కల నివాసముంటున్న వారి వేలి ముద్రలను తీసుకున్నారు. అయితే వీరి వేలిముద్రలు సరిపోలలేదు. చివరగా సందీప్ ఒక్కడే మిగిలిపోయాడు. పోలీసులు పిలిస్తే తనకు ఇటుకలపల్లి పోలీసుస్టేషన్‌లో కోట్ల రూపాయల స్థలానికి చెందిన పంచాయితీ నడుస్తోందని, తానిప్పుడు రాలేనని బుకాయిస్తూ వచ్చాడు. రెండు రోజులు ఎదురు చూసిన పోలీసులు ఎట్టకేలకు సందీప్‌ను స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టారు. అయినా అతని నుంచి సరైన వివరాలు రాలేదు. చివరగా వేలిముద్రలు మ్యాచ్ అయ్యాయని చెప్పడంతో చేసేదిలేక సందీప్ నగలు చోరీ చేసింది తానేనని ఒప్పుకున్నాడు. కాజేసిన బంగారు నగలను బ్యాంకులో తాకట్టు పెట్టి వచ్చిన డబ్బును తాగుడు కోసం ఖర్చు చేసినట్లు చెప్పాడు. నిందితుడు సందీప్‌ను పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు.

క్లుప్తంగా

జాతీయ శిక్షణ శిబిరానికి ఎంపిక



కిరణ్మయిని అభినందిస్తున్న బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

ధర్మవరం అర్బన్: బాస్కెట్‌బాల్ జాతీయ శిక్షణ శిబిరానికి ధర్మవరం క్రీడాకారిణి కిరణ్మయి ఎంపికైనట్లు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రా రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగానే స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని బాస్కెట్‌బాల్ కోర్టులో ఆదివారం సాయంత్రం నేషనల్ క్యాంపునకు ఎంపికైన క్రీడాకారిణి కిరణ్మయిని ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. ఆత్మీయ ట్రస్ట్ వైస్ చైర్మన్ సూర్యప్రకాష్ క్రీడాకారిణి కిరణ్మయికి రూ.5 వేలు నగదును బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా, కోచ్ సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అభ్యాస వర్గ సమావేశాలు



సమావేశంలో పాల్గొన్న ఆపస్ నాయకులు

రాప్తాడురూరల్: పుట్టపర్తిలో 30, 31 తేదీల్లో జరిగే ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) అభ్యాస వర్గ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం అనంతపురం నగరంలోని ఆపస్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆపస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంఘం ఆధ్వర్యంలో ఏదో ఒక ప్రాంతంలో అభ్యాస వర్గ సమావేశాలు నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరం పుట్టపర్తిలో నిర్వహించాలని రాష్ట్ర శాఖ నిర్ణయించిందన్నారు. ఈ సమావేశాల్లో ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ, విద్యార్థుల్లో నైతిక విలువలు, దేశభక్తి పెంపొందించేందుకు శిక్షణ ఇస్తారన్నారు. రాష్ట్ర బాధ్యులు, 26 జిల్లాల నుంచి జిల్లాకు ఆరుగురు చొప్పున ఈ అభ్యాస వర్గ సమావేశాలకు హాజరవుతారన్నారు. సమావేశంలో శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు అమరా చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, అనంతపురం జిల్లా అధ్యక్షురాలు కళ్యాణి, ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి, హర్ష, రమేష్ ,అరవింద్ పాల్గొన్నారు.

మొక్కవోని సంకల్పం

- పర్యావరణ పరిరక్షణకు ఏఎస్పీ హనుమంతు విశేష కృషి
- ఎక్కడ పనిచేసినా మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ
- ఇప్పటికే 50 వేలకు పైగా మొక్కలు నాటించిన వైనం
- సిబ్బంది, విద్యార్థుల్లోనూ పర్యావరణంపై స్పృ కలిగేలా ప్రేరణ



అనంతపురం ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లోని నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఏఎస్పీ హనుమంతు

అనంతపురం డెస్క్: ప్రకృతిని ఆరాధించడమంటే పరమాత్మను పూజించడమేనని పెద్దలు చెబుతుంటారు. ఈ విషయాన్ని గుర్తించిన ఆయన పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి చేస్తున్నారు. ఒకవైపు పోలీసు శాఖలో ఉన్నతాధికారిగా పనిచేస్తూనే..మరోవైపు మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఇప్పటికే వేలాది మొక్కలను నాటించి..సంరక్షించారు. ప్రకృతిపై ఆరాధనను తాను పెంపొందించుకోవడమే కాకుండా కిందిస్థాయి సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు కూడా ఆ బాటలో పయనించేలా కృషి చేస్తున్నారు. ఆయనే.. ఆర్మ్‌డ్ రిజర్వు (ఏఆర్) అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (ఏఎస్పీ)గా పనిచేస్తున్న ఎ.హనుమంతు.

అలా మొదలైంది..

ఏఎస్పీ హనుమంతు స్వగ్రామం శ్రీఅన్నమయ్య జిల్లా కలికిరి మండలం తెల్లగుట్టపల్లి. 1991 సంవత్సరంలో రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఎస్ఐ)గా పోలీసు శాఖలో చేరారు. 1999లో రిజర్వు ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)గా పదోన్నతి లభించింది. తర్వాత గ్రేహౌండ్స్ విభాగంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో పని చేశారు. గ్రేహౌండ్స్‌లో ఉన్నప్పుడు ఖాళీ సమయం దొరికేది. ఆ సమయంలో మొక్కలు నాటడం ప్రారంభించారు. గ్రేహౌండ్స్ ఆపరేషన్లలో భాగంగా ఎక్కడికెళ్లినా అక్కడ మొక్కలు నాటేవారు. అలా మొదలైన అలవాటు కాస్త ప్రకృతిని ఆరాధించే స్థాయికి తీసుకెళ్లింది. డీఎస్పీగా పదోన్నతి పొందిన తర్వాత మొక్కల పెంపకాన్ని మరింత విస్తృతం చేశారు. కిందిస్థాయి సిబ్బంది సహకారంతో విజయనగరం, కల్యాణీ డ్యాం (తిరుపతి), కడప డీటీసీ తదితర చోట్ల వేలాది మొక్కలు నాటించారు.

ధ్యానం.. మారిన దృక్పథం..

పోలీసు శాఖలో పనిఒత్తిడి సహజం. బయటపడాలంటే వ్యాయామం, యోగా, ధ్యానం వంటివి అవసరం. దీంతో హనుమంతు కూడా ధ్యానంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా 2014లో పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకులు సుభాష్ పత్రీజీ తరగతులకు హాజరయ్యారు. ఆయన ఉపదేశాలు హనుమంతు దృక్పథాన్ని పూర్తిగా మార్చివేశాయి. శ్వాస మీద ధ్యాస పెట్టడమే ధ్యానం. శ్వాసకు మూలమైన గాలిని ఇచ్చేవి చెట్లు. దీంతో చెట్లను ఆరాధిస్తే ఈశ్వరుడ్ని ఆరాధించినట్లేనన్న పత్రీజీ బోధనలు బాగా ప్రభావితం చేశాయి. మొక్కల పెంపకాన్ని మరింత విస్తృతం చేశారు. సకల జీవరాశి మనుగడ మొక్కలపైనే ఆధారపడిందన్న వాస్తవాన్ని పాఠశాలలు, కళాశాలలు, ఇతరత్రా వేదికలపై ప్రచారం చేస్తున్నారు.

ఉద్యమంలా చేపట్టాలని..

మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టేందుకు అనంత ప్రకృతి ఫౌండేషన్ అనే సంస్థను ఇటీవలే నెలకొల్పారు. ఇందులో భాగంగా సేవా, ధార్మిక సంస్థలతో కలసి పనిచేస్తున్నారు. ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో నర్సరీ సైతం నిర్వహిస్తున్నారు. ఇందులో వివిధ రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఆసక్తి ఉన్న వ్యక్తులు, సంస్థలకు సైతం అందిస్తున్నారు.

మొక్క నిత్యాన్నదానం చేస్తుంది



సకల జీవరాశి మనుగడ మొక్కలపైనే ఆధారపడి ఉంది. గాలి, పండ్లు మొదలుకుని..ప్రతి ఒక్కటీ అందిస్తుంది. ఒకరకంగా చెప్పాలంటే మొక్క నిత్యాన్నదానం చేస్తుంది. జీవరాశితో పాటు ప్రకృతిని కాపాడుతుంది. నా దృష్టిలో మొక్క ఈశ్వరుడితో సమానం. ఈశ్వరుడు ఎలాగైతే విషాన్ని తన కంఠంలో పెట్టుకుని లోకాన్ని కాపాడాడో.. మొక్క కూడా విషవాయువులను తాను పీల్చుకుని స్వచ్ఛమైన గాలిని మనకు అందిస్తోంది. ప్రతిఒక్కరూ మొక్కల పెంపకాన్ని బాధ్యతగా తీసుకోవాలి.

– ఎ.హనుమంతు, ఏఎస్పీ (ఏఆర్)



సిద్ధరాంపురం పోలీసు లేఅవుట్‌లో మొక్కలకు నీరు పెడుతున్న ఏఎస్పీ హనుమంతు

50 వేలకు పైగా మొక్కల పెంపకం..

ఏఎస్పీ హనుమంతు ఇప్పటిదాకా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 50 వేలకు పైగా మొక్కలు నాటించారు. ఒక్క అనంతపురం జిల్లాలోనే పది వేల మొక్కలు నాటించారు. జిల్లాలోని నాగలాపురం, సోమలాపురం, నార్పల, వెంకటాపురం, సిద్ధరాంపురం పోలీసు లేఅవుట్, ఫైరింగ్ రేంజ్, ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ (అనంతపురం) తదితర ప్రాంతాల్లో ఆయన నాటించిన మొక్కలు పెరిగి పెద్దవవుతున్నాయి. కేవలం మొక్కలు నాటించడంతోనే తన బాధ్యత పూర్తయిందని అనుకోలేదు. వాటి సంరక్షణనూ చేపడుతున్నారు. తీరిక దొరికినప్పుడల్లా వెళ్లి ప్రతి మొక్కనూ పరిశీలించి..అక్కడి సిబ్బందికి తగిన జాగ్రత్తలు చెప్పి వస్తున్నారు. మొక్కల సంరక్షణలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మతో పాటు ఆర్డీటీ, కొందరు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు సహకారం అందిస్తున్నారు.



సిద్ధరాంపురం పోలీసు లేఅవుట్‌లో పెరిగి పెద్దవవుతున్న మొక్కలు

ఉరవకొండలో దొంగల హల్‌చల్

- 21 తులాల బంగారు, 30 తులాల వెండి, నగదు అపహరణ

ఉరవకొండ: పట్టణంలో దొంగలు బీభత్సం సృష్టించారు. పక్కపక్కనే ఉన్న ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. స్థానికుల వివరాలమేరకు... స్థానిక ఇంద్రానగర్ 9వ లైన్‌లో నివాసముంటున్న ప్రైవేటు ఎలక్ట్రీషియన్ నజీర్ తన ఇంటికి తాళం వేసి ఉక్కపోత కారణంగా ఇంటి పక్కన ఉన్న వరండాలో కుటుంబ సభ్యులతో నిద్రపోయారు. శనివారం అర్ధరాత్రి దొంగలు నజీర్ ఇంటికి వేసిన తాళాలను కటర్ సాయంతో కట్ చేసి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో దాచిన 18 తులాల బంగారు, 30 తులాల వెండి, రూ.లక్ష నగదు దోచుకెళ్లారు. తెల్లవారుజామున ఇంటి తలుపులు తెరిచి ఉండటం గమనించిన నజీర్ ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు ధ్వంసం చేసినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అలాగే నజీర్ ఇంటి పక్కనే నివాసముంటున్న కార్పెంటర్ దయానంద అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలసి రెండు రోజుల క్రితం తిరుమలకు వెళ్లారు. దొంగలు వారి ఇంటి తాళాలను ధ్వంసం చేసి బీరువాలో ఉన్న మూడు తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. దయానందకు చోరీ విషయాన్ని స్థానికులు తెలియజేయడంతో తిరుమల నుంచి హుటాహుటినా తిరుగు ప్రయాణమయ్యారు. సీఐ హరినాథ్ సిబ్బందితో పాటు క్లూస్ టీంతో కలిసి చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు.



దొంగతనం జరిగిన నజీర్ ఇంట్లో బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

నేడు ప్రజా సంక్షేమ యాత్ర ముగింపు

- గన్నెవారిపల్లి కాలనీలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి బహిరంగ సభ

తాడిపత్రి: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూడో విడత ప్రజా సంక్షేమ పాదయాత్ర సోమవారం ముగియనుంది. తాడిపత్రి మండలంలో ఈ నెల 15న మొదలైన పాదయాత్ర రెండు వారాలు దిగ్విజయంగా సాగింది. సోమవారం గన్నెవారిపల్లి కాలనీలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభతో మండలంలో పాదయాత్ర ముగియనుంది. ఉదయం 7 గంటలకు మార్కెట్ యార్డు ఆవరణ నుంచి ఎమ్మెల్యే పెద్దారెడ్డి పాదయాత్ర అశోక్ పిల్లర్ సర్కిల్, గాంధీ సర్కిల్, యల్లనూరు రోడ్ సర్కిల్ మీదుగా బస్టాండ్ సర్కిల్‌కు చేరుకుంటుంది. అనంతరం బహిరంగ సభా వేదిక వద్దకు చేరుకుంటారు. పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. బహిరంగ సభకు నలుమూలల నుంచి వేలాదిమంది హాజరుకానున్నారు. జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలతో పాటు మంత్రులు, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో బహిరంగ సభా స్థలాన్ని ఎస్పీ శ్రీనివాసులు, అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు, డీఎస్పీ గంగయ్య ఆదివారం స్థానిక పోలీసు అధికారులతో కలసి పరిశీలించారు. బందోబస్తుపై సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు.



బహిరంగసభకు అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

ఎన్‌టీఆర్ ఆత్మ క్షోభిస్తుంది

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు ఆత్మక్షోభించేలా టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ఒక ప్రకటనలో విమర్శించారు. సీఎం పదవి కోసం ఎన్‌టీఆర్‌ను చంద్రబాబు మానసికంగా హింసించేలా ఆయనపై చెప్పులు వేయించడంతో పాటు కుటుంబ సభ్యులను దూరం చేయించారన్నారు. ఇప్పుడు ఎన్‌టీఆర్ శతజయంతి పేరుతో వేడుకలు జరుపుతుండటం చంద్రబాబు దిగుజారుడు రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ ఓ నకిలీ పార్టీ అని ఎద్దేవా చేశారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని రానున్న రోజుల్లో తప్పక బుద్ధి చెబుతారన్నారు.

ఏపీఎస్‌సీసీఎఫ్‌సీ ఎండీ నేడు జిల్లాకు రాక

అనంతపురం అర్బన్: ఏపీఎస్‌సీసీఎఫ్‌సీ (ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కాస్ట్స్ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్) ఎండీ చిన్నరాముడు సోమవారం జిల్లాకు విచ్చేయనున్నారు. ఉదయం 9 గంటలకు కర్నూలు నుంచి బయలుదేరి అనంతపురం చేరుకుంటారు. రాయదుర్గం, రాప్తాడు మండలాల్లో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి జడ్‌బీఎన్ఎఫ్ (జీరో బడ్జెట్ న్యాచురల్ ఫార్మింగ్) రైతులతో ఆయన మాట్లాడతారు. సాయంత్రం ఇక్కడి నుంచి బయలుదేరి కర్నూలుకు వెళతారు.

వ్యక్తి ఆత్మహత్య

బెళుగుప్ప: మండల పరిధిలోని నరసాపురం గ్రామానికి చెందిన వన్నూరుస్వామి (45) దాయాదులతో గొడవపడి తీవ్ర మనస్తాపం చెంది ఆదివారం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రామకృష్ణయ్య వివరాల మేరకు... వన్నూరుస్వామి తన ఇంటి ముందు స్థలంలో మురుగునీరు చల్లారనే విషయంలో దాయాదుల ఘర్షణ పడ్డాడని తెలిపారు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్థాపంతో ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు. మృతుని భార్య గౌరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలేరమ్మ ఆలయంలో చోరీ

బెళుగుప్ప: మండల పరిధిలోని నక్కలపల్లికి చెందిన పోలేరమ్మ ఆలయంలో శనివారం రాత్రి దొంగలు వెండి ఆభరణాలను దొంగలించారు. రోజూ మాదిరే ఆదివారం కూడా ఉదయాన్నే దేవాలయానికి వెళ్లిన అర్చకులు ఉలిగప్ప సుమారు 30 తులాల వెండి ఆభరణాలు దొంగిలించినట్లు గుర్తించారు. గ్రామస్తులతో కలసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన జరిగిన ప్రాంతాన్ని ఎస్ఐ రామకృష్ణయ్య పరిశీలించారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో 'అనంత' ప్రతిభ



ప్రతిభ చాటిన అనంతపురం జిల్లా క్రీడాకారులు

అనంతపురం: అంతర జిల్లాల బాల, బాలికల జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు శ్రీఅన్నమయ్య జిల్లా టి.సుండుపల్లిలో జరిగాయి. పోటీల్లో అనంతపురం జిల్లా బాల, బాలికల జట్టు చక్కటి ప్రతిభ కనబరిచారు. బాలికల విభాగంలో అనంతపురం జిల్లా జట్టు తృతీయ స్థానాన్ని , బాలుర విభాగంలో అనంతపురం జట్టు ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. కార్యక్రమంలో రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు, సెక్రెటరీ నాగేంద్ర తదితరులు ప్రతిభ చాటిన క్రీడాకారులను అభినందించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



బాలచంద్ర (ఫైల్)

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం గ్రామంలో విద్యుదాఘాతంతో ఎరుకులవాండ్లపల్లి చెందిన బాలచంద్ర (24) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికుల వివరాలమేరకు... కదిరిలోని డిజిటల్ టీవీలో బాలచంద్ర కూలిగా పనిచేస్తున్నారు. ఆదివారం టీవీ కేబుల్ పని నిమిత్తం కాళసముద్రంలో విద్యుత్ స్తంభానికి నిచ్చెన వేసుకుని ఎక్కుతుండగా అప్పటికే స్తంభానికి విద్యుత్ సరఫరా అవుతుండటంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. రూరల్ మండల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాలచంద్ర తండ్రి ఇప్పటికే చనిపోగా తల్లి రమణమ్మతో కలసి జీవనం సాగిస్తున్నారు. బాలచంద్ర మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్ట్

కొత్తచెరువు: మండలంలోని మైలసముద్రం గ్రామ సమీపంలోని మల్లప్పకొండ వద్ద కోడిపందేల స్థావరంపై ఆదివారం ఎస్ఐలు లింగన్న, నరసింహులుతో కలసి దాడులు నిర్వహించినట్లు సీఐ జయనాయక్ తెలిపారు. ఇందులో భాగంగానే 12 మంది జూదరులను అరెస్ట్ చేశామన్నారు. 8 ద్విచక్ర వాహనాలు, 11 సెల్‌ఫోన్లు రూ.5,190 నగదు, రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మరికొందరు పరారీలో ఉన్నారని, త్వరలోనే వారిని కూడా అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరు పరచనున్నట్లు చెప్పారు.

పంచాయతీరాజ్ ఉద్యోగులకు పదోన్నతులు



జిల్లా పరిషత్ కార్యాలయం

- రాష్ట్ర వ్యాప్తంగా 205 మంది ఏఓలు, ఈఓపీఆర్‌డీలకు ప్రమోషన్లు
- 'ఉమ్మడి అనంత' జిల్లాలో 11 మందికి దక్కిన అవకాశం

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎన్నాళ్లనుంచో పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న పరిపాలనాధికారులు, ఈఓపీఆర్‌డీల కలను సాకారం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 400కు పైబడి ఎంపీడీఓ పోస్టులు ఖాళీగా ఉండగా, ప్రస్తుతం పదోన్నతుల ద్వారా 205 మందికి ఎంపీడీఓలుగా అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో 112 మంది ఏఓలు ఉండగా, 93 మంది ఈఓపీఆర్‌డీలు ఉన్నారు.

'అనంత' జిల్లాలో 11 మందికి ఛాన్స్..

ఉమ్మడి అనంతపురం జిల్లా విషయానికొస్తే.. 11 మందికి ఇప్పుడు పదోన్నతులు దక్కాయి. వారిలో ఆరుగురు పరిపాలనాధికారులు (ఏఓలు) ఉండగా, ఐదుగురు ఈఓపీఆర్‌డీలు ఉన్నారు. వారందరినీ జిల్లాలకు కేటాయిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

వెంటనే విధుల్లో చేరాలి..

పదోన్నతులపై వివిధ జిల్లాలకు కేటాయించిన పరిపాలనాధికారులు, ఈఓపీఆర్‌డీలు వెంటనే తమకు కేటాయించిన జిల్లాలకు వెళ్లిపోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలకు వెళ్లి రిపోర్ట్ చేసుకున్న తరువాత మండలాలు కేటాయిస్తారని స్పష్టం చేశారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం..

తాము ఎన్నో ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురు చూశామని, ఇన్నాళ్లకు తమ కల నెరవేరినందుకు ఆనందంగా ఉందని పదోన్నతి పొందిన ఏఓలు, ఈఓపీఆర్‌డీలు తెలిపారు. పాతికేళ్ల తరువాత ఎంపీడీఓలను డీఎల్‌డీఓలుగా పదోన్నతి కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ... ఇప్పుడు తమకు ఎంపీడీఓలుగా అవకాశం కల్పించారని హర్షం వ్యక్తం చేశారు.

పదోన్నతి పొందిన వారి వివరాలు ఇలా..

అధికారి పేరు	హోదా	ప్రస్తుత ప్రదేశం	పదోన్నతిపై కేటాయించిన జిల్లా
పి.మైథిలి	ఏఓ	చెన్నేకొత్తపల్లి	అనంతపురం
పి.కృష్ణమోహన్‌బాబు	ఏఓ	జిల్లా పరిషత్	శ్రీసత్యసాయి
ఎ.జాషువా	ఏఓ	గుంతకల్లు	అన్నమయ్య
ఎల్.నారాయణస్వామి	ఏఓ	కుందుర్పి	అన్నమయ్య
జీఎస్ రామచంద్ర	ఏఓ	ధర్మవరం	అనంతపురం
ఎస్.నరసింహమూర్తి	ఏఓ	మడకశిర	అనంతపురం
గంగావతి	ఈఓపీఆర్‌డీ	శెట్టూరు	శ్రీసత్యసాయి
అలివేలమ్మ	ఈఓపీఆర్‌డీ	అనంతపురం రూరల్	శ్రీసత్యసాయి
సౌజన్యకుమారి	ఈఓపీఆర్‌డీ	కూడేరు	శ్రీసత్యసాయి
విజయలక్ష్మి	ఈఓపీఆర్‌డీ	బత్తలపల్లి	శ్రీసత్యసాయి
నరసింహులు	ఈఓపీఆర్‌డీ	చెన్నేకొత్తపల్లి	శ్రీబాలాజీ

ఇతర ప్రాంతాల నుంచి ఉమ్మడి జిల్లాకు రానున్న ఎంపీడీఓలు

అధికారి పేరు	హోదా	ప్రస్తుతం	కేటాయించిన జిల్లా
ఎం.సుధాకర్‌రాజు	ఏఓ	కర్నూలు	అనంతపురం
కె.విజయశేఖర్‌రావు	ఏఓ	కర్నూలు	అనంతపురం
ఎస్.బసా నాయక్	ఏఓ	కర్నూలు	అనంతపురం
పి.విజయలలిత	ఏఓ	కర్నూలు	అనంతపురం
బి.కృష్ణమోహన్‌రావు	ఏఓ	వైఎస్సార్	అనంతపురం
సి.వెంకటరమణప్ప	ఈఓపీఆర్‌డీ	కర్నూలు	అనంతపురం
వై.పుల్లయ్య	ఈఓపీఆర్‌డీ	నంద్యాల	అనంతపురం
బి.వీరరాజు	ఈఓపీఆర్‌డీ	నంద్యాల	అనంతపురం
ఐ.సాల్మన్	ఈఓపీఆర్‌డీ	నంద్యాల	అనంతపురం
కె.వరలక్ష్మి	ఈఓపీఆర్‌డీ	కర్నూలు	శ్రీసత్యసాయి

సందడిగా అపూర్వ సమ్మేళనం

వజ్రకరూరు: మండల కేంద్రంలోని స్థానిక కేవీజెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1975–1976 బ్యాచ్ పదో తరగతికి చెందిన విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమకు చదువు చెప్పిన గురువులు హనుమంతప్ప, కాడప్ప (ఉపాధ్యాయులు) తదితరులను సత్కరించి గురు భక్తిని చాటుకున్నారు. తర్వాత ఒకరి కష్టసుఖాలను మరొకరు తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఆనందంగా గడిపారు.



క్లుప్తంగా

31 నుంచి పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట



ఆత్మకూరు పొలిమేర వద్ద నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయం

ఆత్మకూరు: ఈ నెల 31 నుంచి పొలిమేర పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట ఉంటుందని ఆత్మకూరు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. ఈ నెల 31న గంగ పూజ, గోపూజ, గణపతి పూజ, నవగ్రహారాధన, అంకురార్పణ, దీక్షా హోమము నిర్వహించబడును, అదే విధంగా 1వ తేదీన ప్రాతఃకాలపూజ,దీక్షాహోమం, అదినాస హోమాలు, విగ్రహము ఊరేగింపు, మూలమంత్ర జపములు, 108 రకములతో అమ్మవారికి అభిషేక కార్యక్రమం నిర్వహించబడును. 2వ తేదీన యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ప్రతిష్ట హోమం, విగ్రహ అలంకరణములు, పూర్ణాహుతి, మహా మంగళహారతి కార్యక్రమాలు ఉంటాయని తెలియజేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. రాహుకేతు హోమాలు, పల్లకీసేవ, ఆకు పూజ, కుజదోష, కాలసర్పదోష నివారణ కోసం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూలమంత్ర బీజాక్షర హోమం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రాహుకేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతోపాటు మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



విన్నర్స్‌గా నిలిచిన ఆత్మకూరు జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎస్‌ఐ జనార్దన్

ఆత్మకూరు: క్రీడలతోనే మానసికోల్లాసమని, చదువుతోపాటు క్రీడలో ఎంతో ముఖ్యమని ఆత్మకూరు ఎస్‌ఐ జనార్దన్ తెలియజేశారు. నెల రోజులుగా ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం ఆత్మకూరు, సనప క్రికెట్ టీమ్‌లు ఫైనల్‌కు చేరాయి. ఇరుజట్ల మధ్య ఉత్కంఠ పోటీ నెలకొంది. 14 ఓవర్లలో నార్పల జట్టు 83 కు ఆల్‌అవుట్ కాగా, ఆత్మకూరు జట్టు 89 పరుగులు సాధించి విజేతగా నిలిచింది. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజమని తెలిపారు. విజేత ఆత్మకూరు జట్టుకు కప్పుతో పాటు రూ.లక్ష అందించారు. రన్నర్స్‌గా నిలిచిన జట్టుకు రూ.50 వేలు, కప్పు అందించారు. మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు కప్పులు అందించారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ నిర్వాహకుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు తైదుల శివారెడ్డి, సీనియర్ క్రీడాకారులు శ్రీధర్, జగన్‌మోహన్‌రెడ్డి, జగదీష్, హనుమంతు, షఫీ, హరినాథ్‌రెడ్డి, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల బదిలీల్లో ఖాళీలన్నీ చూపాలి



నిరసన తెలియజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

రాప్తాడురూరల్: టీచర్ల బదిలీల్లో ఖాళీలన్నీ చూపాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సైన్స్ సెంటర్‌లో నిరసన తెలియజేశారు. ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ టీచర్లు ప్రమోషన్ల కోసం దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నారన్నారు. 2022లో ప్రమోషన్లు ఇస్తామని ఉపాధ్యాయుల నుంచి విల్లింగ్ తీసుకున్నారన్నారు. ప్రమోషన్ల వ్యవహారం కోర్టు పరిధిలో ఉందని, అదితేలిన తర్వాత ప్రమోషన్లు ఖరారు చేస్తామని చెప్పారన్నారు. అనంతరం డీవైఈఓ పద్మప్రియకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫ్టో జిల్లా చైర్మన్ ఎస్. సిరాజుద్దీన్, సెక్రటరీ జనరల్ జి. లింగమూర్తి, సత్యసాయి జిల్లా ఫ్యాప్టో చైర్మన్ శ్రీనివాసులు, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ రమణరెడ్డి, గోవిందరాజులు, శ్రీనివాసరెడ్డి, నాయకులు బి. నరసింహులు, గోపాలరెడ్డి, సూర్యుడు, జి. వెంకటేష్, నాగేంద్ర, విశ్వనాథరెడ్డి, రత్నం, అనిల్, చంద్ర, దేశాయ్ నాగరాజు, సర్దారవలి, ఎర్రిస్వామి, శివ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలా? ఫోన్ చేయండి





అనంతపురం టౌన్: నగరంలోని విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ శాఖ అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండి వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్లు అందుబాటులోకి తెచ్చారు. నగర పరిధిలో ప్రత్యేకంగా 6 విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసి, వాటి ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. వీటి పరిధిలో ఏవైనా సమస్యలు తలెత్తినా, విద్యుత్ సరఫరా కాకపోయినా వెంటనే వినియోగదారులు ఫిర్యాదు చేయొచ్చు. సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండి, ఫోన్ చేసిన వెంటనే నిమిషాల వ్యవధిలోనే సమస్యలు నమోదు చేసుకొని పరిష్కరించనున్నట్లు విద్యుత్ శాఖ అనంతపురం డీఈఈ రమేష్ తెలిపారు.

▸▸ డిస్ట్రిబ్యూషన్–1 సబ్ స్టేషన్ :
ఈ సబ్‌స్టేషన్ పరిధిలోకి భవానీనగర్, అంబేడ్కర్ నగర్, అనంత సాగర్ కాలనీ, కలెక్టరేట్ సంఘమేష్ నగర్, బోయగేరి, నీరుగంటివీధి, వీరభద్రకాలనీ, సున్నపు వీధి తదితర ప్రాంతాల విద్యుత్ సమస్యల కోసం ఫోన్ నంబర్: 7382605301 సంప్రదించాలి.

▸▸ డిస్ట్రిబ్యూషన్ –2 సబ్ స్టేషన్:
శ్రీనివాసనగర్, రామచంద్రానగర్, షిర్డీనగర్, ఎర్రనేలకొట్టాల, లెక్చరర్స్ కాలనీ, ప్రకాష్‌రోడ్డు, కమలానగర్, గుల్జార్‌పేట, ఆదిమూర్తినగర్, రహమత్‌నగర్, కోర్టురోడ్డు, అరవింద్‌నగర్, ప్రభుత్వాస్పత్రి, పటేల్‌రోడ్డు, బాబానగర్ తదితర ప్రాంతాలవారు సెల్: 7382605302లో సంప్రదించొచ్చు.

▸▸ డిస్ట్రిబ్యూషన్–3 సబ్ స్టేషన్:
కోవూరునగర్, శ్రీనగర్‌కాలనీ, ఆర్కేనగర్, శాంతినగర్, హెచ్చెల్సీ కాలనీ, రామ్‌నగర్, లక్ష్మీనగర్, మొదటిరోడ్డు నుంచి ఐదోరోడ్డు వరకు, మారుతీనగర్, గౌరవగార్డెన్స్, శ్రీ శ్రీ నగర్, బ్యాంక్‌కాలనీ, ఆజాద్ నగర్ తదితర ప్రాంతాల ప్రజలు సెల్: 7382605303లో సంప్రదించొచ్చు.

▸▸ డిస్ట్రిబ్యూషన్–4 సబ్ స్టేషన్:
హౌసింగ్‌బోర్డు, ఆదర్శనగర్, నాయక్‌నగర్, సాయినగర్, విద్యుత్ నగర్, శారదానగర్, చిన్మయనగర్, కళాకారుల కాలనీ, లెనిన్‌నగర్, రామకృష్ణకాలనీ, ఎల్ఐసీ కాలనీ, బుడ్డప్పనగర్ తదితర ప్రాంతాల ప్రజలు సెల్: 7382605304లో సంప్రదించాలి.

▸▸ డిస్ట్రిబ్యూషన్–5 సబ్ స్టేషన్:
కళ్యాణదుర్గంరోడ్డు, బళ్లారి రోడ్డు, తపోవనం, గణేషన్‌నగర్, ఆంజనేయనగర్, జొన్నా వీరయ్యకాలనీ, బసవతారకనగర్, నందమూరి నగర్, సైఫుల్లా కాలనీ, పాపంపల్లి, జాకీర్ కొట్టాల, రజాక్‌నగర్, సోమనాథ్‌నగర్, ప్రశాంతినగర్, ప్రియాంకనగర్, నీలమ్మకాలనీ, రాయల్‌నగర్, జనశక్తినగర్ తదితర ప్రాంతాల ప్రజలు సెల్: 7382605305లో సంప్రదించాలి.

▸▸ డిస్ట్రిబ్యూషన్–6 సబ్ స్టేషన్:
జనచైతన్యకాలనీ, రాజీవ్‌కాలనీ, నారాయణరెడ్డి కాలనీ, గుజ్జల సరళాదేవి నగర్, తారకరామ కొట్టాల, రామిరెడ్డి కాలనీ, గుత్తిరోడ్డు, రిక్షాకాలనీ, ఎల్‌బీనగర్, బిందెలకాలనీ, ఎస్సీ కాలనీ, వేణుగోపాల్‌నగర్, టీచర్స్ కాలనీ మార్కెట్ యార్డు ముందు ప్రాంతం, కల్పనాజోషి కాలనీ, భాగ్యనగర్, షికారీ కొట్టాల, చలమారెడ్డి నగర్, వీరుపాక్షనగర్ తదితర ప్రాంతాల ప్రజలు సెల్: 7382605306లో సంప్రదించాలి.

రేడియాలజీ టెక్నీషియన్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

అనంతపురం క్రైం: నగరంలోని పాతూరు చెస్ట్ డీసీస్ (సీడీ) ఆస్పత్రిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ రేడియాలజీ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం జరిగింది. సమావేశంలో టెక్నీషియన్ల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి అంజెడాను సిద్ధం చేశారు. రెగ్యులర్ రేడియోగ్రాఫర్లతో సమానంగా 11 నెలల వరుస విధి నిర్వహణ తర్వాత నెల రోజుల సెలవు, ఏపీవీవీపీ, డీఎంఈ, డీహెచ్ పరిధిలో భవిష్యత్తులో జరిగే నియామకాలు కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేయాలని, తదితర డిమాండ్లతో తీర్మానం చేశారు. సమావేశంలో అసోసియేషన్ ఏపీ అమరావతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శివ ప్రసాద్, కార్యదర్శి రాంప్రసాద్ పాల్గొన్నారు.

అసోసియేషన్ ఇదే:
జిల్లా అధ్యక్షుడిగా వెంకటనారాయణ, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా రామకృష్ణారెడ్డి, సభ్యులుగా విశ్వమూర్తి, లోకేష్, రామకృష్ణ, సునీల్ కుమార్‌ను ఎంపిక చేశారు.



కాంట్రాక్ట్ రేడియాలజీ టెక్నీషియన్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

ప్రజా చైతన్యంతోనే సీమ సమస్యల పరిష్కారం

అనంతపురం కల్చరల్: ప్రజా చైతన్యంతోనే రాయలసీమ సమస్యలు పరిష్కారమవుతాయని ప్రముఖ కవి జెట్టి జైరాం అన్నారు. రాయలసీమ సాంస్కృతిక వేదిక, వేమన అధ్యయన అభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం కేతు విశ్వనాథరెడ్డి పేరిట ఏర్పాటు చేసిన అంతర్జాల వేదికగా మహాకవి సమ్మేళనం జరిగింది. కేంద్రసాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవులు తమ కవితాగానం చేశారు. సీనియర్ కవి జెట్టి జైరాం, హరినాథరెడ్డి, బొజ్జాదశరథరామిరెడ్డి, జనసాహితి సూర్యసాగర్, రైతు నాయకులు లోచర్ల విజయభాస్కరరెడ్డి తదితరులు పలు అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో వాసంతి, రవికుమార్, రాజశేఖరరెడ్డి, నిర్మల సమన్వయకర్తలుగా వ్యవహరించారు. అంతకుముందు ఇటీవల దివంగతులైన కేతు విశ్వనాథరెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సాహితీ విలువలను గుర్తు చేసుకున్నారు.



అంతర్జాలం ద్వారా ప్రసంగిస్తున్న సీనియర్ కవులు, రచయితలు

పాతూరు మార్కెట్‌లో పర్సు మాయం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పాతూరు కాయగూరల మార్కెట్‌కు వచ్చిన మహిళ పర్సును గుర్తు తెలియని దుండుగలు ఆదివారం అపహరించారు. వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డి తెలిపిన మేరకు.. నార్పల మండలం నడిమిదొడ్డికి చెందిన గంగాదేవి అనే మహిళ నగరానికి కాయగూరలు కొనేందుకు వచ్చింది. తన పర్సును కాయగూరల బ్యాగులో ఉంచుకుంది. తిరిగి చూస్తే కనిపించలేదు. పర్సులో రూ.40 వేలు నగదు, ఏటీఎం కార్డులు ఉన్నట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

భర్తపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు
అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ప్రేమించి కులాంతర వివాహం చేసుకొని వేధిస్తున్నాడని స్వాతీ అనే వివాహిత భర్త గౌతమ్‌రెడ్డిపై వన్‌టౌన్ పోలీసులకు ఆదివారం రాత్రి ఫిర్యాదు చేసింది. సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపిన మేరకు.. స్థానిక జేఎన్‌టీయూ కళాశాల సమీపంలో గౌతమ్‌రెడ్డి, స్వాతీలు దంపతులు నివాసం ఉంటున్నారు. వీరిది కులాంతర వివాహం. కాగా పెళ్లి చేసుకున్న కొంత కాలం బాగా చూసుకున్న భర్త క్రమేనా మరిది, అత్త, మామల మాటలు విని కట్టుకున్న భార్యను వేధింపులకు గురి చేస్తున్నాడు. కులం పేరుతో దూషించడం ప్రారంభించాడు. దీంతో విసిగి పోయిన భార్య ఫిర్యాదు చేసింది.

నేడు 'స్పందన'

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో ఉదయం 10.30 గంటలకు స్పందన కార్యక్రమం ఉంటుందని కమిషనర్ రమణారెడ్డి ఆదివారం తెలిపారు. నగర ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేయొచ్చన్నారు.

అస్సాం యువకుడికి రిమాండ్

గార్లదిన్నె: అస్సాంకు చెందిన పప్పుబాగ్ అలియాస్ (రాజు) అనే యువకుడు ఓ బాలికపై లైంగిక దాడి చేయడంతో గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌లో అతడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఆదివారం పోలీసులు యువకుడిని అరెస్ట్ చేసి అనంతపురం జిల్లా కోర్టులో హాజరు పరిచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు.

ముగిసిన తైక్వాండో పోటీలు

తాడిపత్రి టౌన్: స్థానిక పుట్లూరు రోడ్డులోని బాలాజీ ఫంక్షన్ హాలులో ఆదివారం రాయలసీమ స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. రాయలసీమ ఉమ్మడి వైఎస్సార్, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చెందిన 300 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ జిల్లా క్రీడాకారులు ప్రథమ స్థానం, అనంతపురం ద్వితీయ స్థానం, కర్నూలు జిల్లా క్రీడాకారులు తృతీయ స్థానంలో నిలిచినట్లు తైక్వాండో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయి తెలిపారు. విజేతలకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హరినాథరెడ్డి, సభ్యులు రాజానాయుడు, సంజీవరెడ్డి మెడల్స్ అందజేశారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

అనంతపురం క్రైం: మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఆదివారం నగరపాలక సంస్థలోని అదనపు సమావేశం గదిలో ఆర్పీలకు ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కమిషనర్ పాల్గొన్నారు. డాక్టర్ పద్మలత రుతుక్రమంలో మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సావిత్రి, మెప్మా సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని అనంతపురం తాడిపత్రి రహదారి పక్కన వెలసిన వాల్మీకి రామాలయంలో ఆదివారం సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. అనంతరం స్వామికి మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవం జరిపించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం అధ్యక్షుడు నరహరి, నాయకులు గంగాధర్, నారాయణస్వామి, కిశోర్, జయ ప్రసాద్, శ్రీధర్, రమణ, ఓబిలేసు, తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని జయప్రదం చేయండి

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి, నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం నిర్వహించనున్న భారీ బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఉదయం 8.30 గంటలకు బళ్లారి బైపాస్‌లోని ఎంజీ పెట్రోల్ బంక్ నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమై, పీటీసీ ఫ్లైఓవర్ మీదుగా టవర్ క్లాక్, సప్తగిరి సర్కిల్, ఐరన్‌బ్రిడ్జ్, గాంధీబజార్,(కూరగాయల మార్కెట్), శ్రీకంఠం సర్కిల్, రైల్వే ఫీడర్ రోడ్డు మీదుగా ఆర్ట్స్ కళాశాల వరకు కొనసాగుతుందని ఆ ప్రకటనలో తెలిపారు.

సంతల ద్వారా రూ.3.56 లక్షల ఆదాయం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాలు, పశువుల సంతల ద్వారా రూ.3.56 లక్షలు పైచిలుకు ఫీజు వసూలైనట్లు యార్డు చైర్మన్, ఏకేఎస్ ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.2,05,680 కాగా, ఆదివారం పశువుల సంత ద్వారా రూ.1,50,850 మేర ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

అసంబద్ధ నిబంధనలు తొలగించాలి

రాప్తాడురూరల్: ప్రభుత్వ టీచర్ల బదిలీల్లో అసంబద్ధ నిబంధనలతో టీచర్లు నష్టపోతున్నారని, వాటిని తొలగించాలని బీసీ ఉపాధ్యాయ సంఘం (బీసీటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పీవీ శివమూర్తి, జిల్లా ప్రధానకార్యదర్శి కిష్టప్ప ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 5/8 అకడమిక్ విద్యా సంవత్సరాలు ఒకే చోట పని చేసే హెచ్‌ఎంలు, టీచర్లు బదిలీ కావాల్సి ఉందన్నారు. 2015లో బదిలీ అయిన టీచర్లు ఎక్కువగా నష్టపోతున్నారన్నారు.

యువతి అదృశ్యం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక శ్రీనగరు కాలనీకి చెందిన సర్వోత్తమచారి కుమార్తె కీర్తి ఈ నెల 27న పానీపూరీ తిని వస్తానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బాధిత కుటుంబ సభ్యులు నాల్గో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. సీఐ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కీర్తన హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తోంది. అదే నగరానికి చెందిన కళ్యాణ్‌కుమార్ అనే యువకుడితో ఈనెల 21న నిశ్చితార్థం అయ్యింది. 23న కుటుంబ సభ్యులంతా అనంతపురం చేరుకున్నారు. 27న ఆమె ఇంటినుంచి వెళ్లిపోయి, తిరిగిరాలేదు.

నేడు విత్తన వేరుశగన పంపిణీ

రాప్తాడు: మండల కేంద్రంలోని ఆర్‌బీకే వద్ద అర్హులైన ప్రతి రైతుకూ సోమవారం విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేస్తామని ఏఓ శుభకర్ ఓ ప్రకటనలో తెలిపారు. విత్తన పంపిణీని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ పసుపుల హేమావతి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మన్నల వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి తదితరులు హాజరవుతారన్నారు.

కనగానపల్లి: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సోమవారం నుంచి రైతులను రాయితీ వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేస్తామని ఏఓ కృష్ణకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం 40 శాతం రాయితీతో విత్తన కాయలు అందజేస్తోందన్నారు. పలువురు రైతులు ఇప్పటికే ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకొన్నారన్నారు. వీరందరికీ ఆయా ఆర్బీకేల పరిధిలోనే గోదాముల వద్దనే విత్తన కాయలు పంపిణీ చేస్తామన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె: కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామి, 108 సాలాగ్రామ శివలింగాలను దర్శించుకుని మొక్కు లు తీర్చుకున్నారు.

'బంగారు'లేడీ దొరికింది

• జింకల లత పాతనేరస్తురాలిగా గుర్తింపు



చోరీ సమయంలోని సీసీపుటేజీలో ఉన్న నిందితురాలు జింకల లత (సర్కిల్‌లో ఉన్న మహిళ)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పైసా పైసా కూడబెట్టుకొని నల్లపూసల గొలుసు (బంగారు) కొనుగోలు చేసిన ఓ మహిళ దేవుడి పాదాల వద్ద ఉంచి పూజ చేయించి, ధరించాలనుకుంది. అంతలోనే ఆలయంలోనే గొలుసు మాయమైంది. బాధితురాలు ఈనెల 21న వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఎట్టకేలకు నల్లపూసల గొలుసు అపహరించిన దొంగ (మహిళ)ను గుర్తించి, పట్టుకున్నారు. విచారణలో ఆ మహిళ పాతనేరస్తురాలుగా తేలింది. వడ్డీవ్యాపారి కూడా కావడం గమనార్హం. కేసు వివరాలను వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డి వెల్లడించారు.

నగరంలోని మొదటి రోడ్డులో నివాసం ఉంటున్న సావిత్రి అనే మహిళ నల్లపూసల గొలుసు (బంగారు) చేయించుకుంది. ఈ నెల 21న బ్రాహ్మణవీధిలోని బృందావనం ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి, స్వామి పాదాల చెంత ఉంచి పూజ చేయించింది. అదేరోజున వ్యాసరాజ మఠం పీఠాధిపతి కూడా వస్తున్నారని తెలుసుకొని అక్కడికి త్వరగా చేరుకుంది. అందరిలాగానే బంగారు గొలుసును పూజారికి ఇచ్చింది. పూజ అనంతరం పూజారి గొలుసును ఆమెకు అందించారు. ఈ విషయాన్ని గమనించిన కిలాడీ లేడి(జింకల లత) తెలివిగా మహిళను ఏమార్చి ఆమె బ్యాగులో దాచిన పర్సును తస్కరించింది.

చోరీల నేపథ్యం ఇదీ..
స్థానిక ఐదో రోడ్డులో నివాసం ఉంటున్న జింకల లత వడ్డీ వ్యాపారం చేస్తోంది. డబ్బు మీద వ్యామోహంతో సులభంగా డబ్బు సంపాదించే మార్గాన్ని ఎంచుకుంది. అందుకు చోరీలు చేస్తేనే సాధ్యమని భావించింది. గతంలో చిన్న చిన్న చోరీలు చేసి, అనంతపురం సీసీఎస్ పోలీసులకు కూడా పట్టుబడింది. అయినా ఆమెలో మార్పు రాలేదు. సావిత్రి పర్సును కాజేసి, బంగారు గొలుసును అనంతపురంలో విక్రయిస్తే పోలీసులు గుర్తిస్తారని భావించి, ధర్మవరంలో విక్రయించాలని బయల్దేరింది. కలెక్టరేట్ వద్ద బస్సుకోసం ఎదురు చూస్తున్న ఆమె (జింకల లత) అటుగా వస్తున్న పోలీసు జీపును చూసి ఉడాయించాలని చూసింది. అనుమానంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని విచారించగా, అసలు విషయం బయటపడింది. దీంతో ఆమెను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

జగనన్నతోనే మహిళలకు భద్రత

అనంతపురం సెంట్రల్: వైఎస్సార్‌సీపీతో ప్రభుత్వంలోనే రాష్ట్రంలో మహిళలకు భద్రత ఉందని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల పేర్కొన్నారు. ఆదివారం టీడీపీ మహానాడులో కొందరు మహిళా నేతలు చేసిన వ్యాఖ్యలను ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల ఖండించారు. అధికారంలో ఉన్నప్పుడు మహిళలను కించపరిచింది చంద్రబాబేనని గుర్తు చేశారు. దళిత అధికారిణి వణజాక్షిని అప్పటి టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దాడి చేసి, దూషించినా చంద్రబాబునాయుడు సమర్థించారన్నారు. మహానాడులో గంగాభవాని, అనిత తదితరులు చేసిన వ్యాఖ్యలు సరికాదని, ఆసమయంలో ముసిముసి నవ్వులతో చంద్రబాబు తన నైజాన్ని బహిర్గతం చేశారని విమర్శించారు. తమ్ముడు రామ్మూర్తి నాయుడును సంకెళ్లతో బంధించి బాహ్య ప్రపంచానికి దూరం చేసిన నీచుడు చంద్రబాబు అని విమర్శించారు. సీఎం జగనన్న విమర్శించే ముందు స్థాయి తెలుసుకొని మాట్లాడాలన్నారు. మరోసారి సీఎంపై విమర్శలు చేస్తే పళ్లు రాలగొడతామని హెచ్చరించారు.

రేపటి నుంచి సువార్త సభలు

పామిడి: పట్టణంలోని క్రీస్తు కల్వరి ప్రార్థన మందిరంలో మంగళవారం నుంచి రెండురోజుల పాటు రక్షణ ఉజ్జీవ సువార్త సభలను నిర్వహిస్తున్నట్లు ఆ ప్రార్థన మందిరం పాస్టర్ సురేంద్ర ఆదివారం తెలిపారు. సభలకు కర్ణాటక రాష్ట్రం హుబ్లీ పట్టణ పాస్టర్ ఓబుల్‌రావు హాజరవుతారన్నారు. సభల్లో క్రైస్తవ విశ్వాసులు పాల్గొని దేవుని మహిమను పొందాలని కోరారు.

స్వచ్ఛంద సేవలకు 'అనంత' వేదిక

అనంతపురం కల్చరల్: మానవతా దృక్పథంతో సేవలందించడానికి 'అనంత' అద్భుత వేదిక అని మానవత సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని 13 జిల్లాలు, 95 మండలాల్లో విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ‘మానవత’ సంస్థ కార్యక్రమాలను ఆదివారం అనంతలో ప్రారంభించారు. స్థానిక కృష్ణకళామందిరంలో సంస్థ కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. సంస్థ ఆశయాలను, సిద్ధాంతాలు వివరించారు. సంస్థ జిల్లా ఇన్‌చార్జ్ రఘునాథ్, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు శీలా జయరామప్ప తదితరులు మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ, రక్తదానం, నైతిక విలువల బోధన, ఉచిత వైద్యశిబిరాల నిర్వహణ, పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు, శాంతి రథాలు తదితర అంశాల్లో చాలా జిల్లాల్లో సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ సంస్థల ప్రతినిధులు తరిమెల అమరనాథరెడ్డి, సెంట్రల్ కమిటీ డైరెక్టర్లు గోపి, సహదేవరెడ్డి, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ న్యాయవాది మనోహరనాయుడు, విశ్రాంత ఆర్మీ అధికారి జయచంద్రారెడ్డి సంస్థ ఆవిర్భావం సందర్భంగా అభినందనలు, సంఘీభావం తెలిపారు.

శనీశ్వరునికి తైలాభిషేకం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో తాడిపత్రి రహదారి పక్కన వెలసిన శనీశ్వరుని పాలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో ప్రధాన అర్చకుడు బాబా స్వామి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కుంకుమ అభిషేకం అర్చనలు, పంచామృత అభిషేకం, తైలాభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని 'సెబ్' ఎస్‌ఐ టోకరా

రాప్తాడురూరల్: సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన 'సెబ్' ఎస్‌ఐ దారి తప్పాడు. ఉద్యోగం ఇప్పిస్తానని ఓ నిరుద్యోగిని మోసగించాడు. బాధితుడి ఫిర్యాదుతో అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురానికి చెందిన విజయ్‌కుమార్ కర్నూలు సెబ్‌లో ఎస్‌ఐగా పని చేస్తున్నారు. పరిచయం ఉన్న అనంతపురం రూరల్ పాపంపేట ఓటీఆర్ కాలనీకి చెందిన మామడూరు గిరినాథరెడ్డికి సెబ్‌లో నామినేటెడ్ పోస్టు ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఇందుకోసం రూ. 2.50 లక్షలు ఖర్చవుతుందని చెప్పాడు. పోస్టు గ్యారంటీ అని తెలిపాడు. దీంతో బాధితుడు 2020 డిసెంబర్‌లో అడ్వాన్స్‌గా రూ. 30 వేలు ఇచ్చాడు. తక్కిన సొమ్ము పోస్టు ఇప్పించిన తర్వాత ఇస్తానని గిరినాథరెడ్డి చెప్పాడు. అప్పటి నుంచి బాధితుడికి పోస్టు వచ్చింది లేదు, తీసుకున్న అడ్వాన్స్ వెనక్కు ఇచ్చింది లేదు. ఎన్నిమార్లు బాధితుడు ఎస్‌ఐను అడిగినా సాకులు చెప్తూ వస్తున్నాడు. చివరికి గిరినాథరెడ్డి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విజయకుమార్‌పై 420 కేసు నమోదు చేశారు. కాగా విజయకుమార్ ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నాడు.

సేఫ్టీ వాల్‌ను ఢీకొన్న ఇన్నోవా కారు

కనగానపల్లి: మండల పరిధిలోని దాదులూరు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న సేఫ్టీ వాల్‌ను ఇన్నోవా కారు ఢీకొట్టింది. దీంతో ఆ ఐరన్ సేఫ్టీ వాల్ పైపులు కారు ముందు భాగం నుంచి దూసుకెళ్లి వెనుక వైపు నుంచి బయటకు వచ్చాయి. కాని కారులోని ప్రయాణికులు మాత్రం స్వల్ప గాయాలతో త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు ఆదివారం సాయంత్రం కర్నూల్‌కు చెందిన సురేష్ కుమార్ తన కూతురుతో కలసి బెంగళూరు నుంచి కర్నూల్‌కు వెళ్తున్నారు. దాదులూరు వద్ద వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న సేఫ్టీవాల్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



కారులోకి దూసుకెళ్లి వెనుక వైపు బయటకు వచ్చిన సేఫ్టీ వాల్ పైపులు